సాక్షి తిరుపతి

మంగళవారం । 12 । మార్చి । 2024



కమనీయం..కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా సాగింది. - 8లో



సమష్టి కృషితో ఎన్నికలు

రానున్న ఎన్నికలను సమష్టి కృషితో విజయవంతం చేయాలని ఎస్పీ కృష్ణ కాంత్ పాటిల్ సూచించారు. - 8లో



న్యూస్‌రీల్

ప్రతి అర్జీకి ప్రాధాన్యం



అర్జీదారుతో మాట్లాడుతున్న జేసీ

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనకార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 119 అర్జీలువచ్చినట్టు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా 85 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవని చెప్పారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, భాస్కర్ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 67 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 67 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ తెలిపారు. వెంటనే సంబంధిత ఫిర్యాదులు పరిష్కారమయ్యేవిధంగా సిబ్బందిని ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రేణిగుంట: రేణిగుంట పాత విమానాశ్రయ మార్గంలోని సీడబ్ల్యూసీ గోడౌన్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను సోమవారం కలెక్టర్ జీ.లక్ష్మీశ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను ఇక్కడ భద్రపరచగా, ఆయన పరిశీలించి 24/7 నిరంతర పటిష్ట నిఘా, భద్రత కొనసాగించాలని ఆదేశించారు. గోడౌన్ ఇన్‌చార్జి ఎస్‌డీసీ కోదండరామిరెడ్డి కలెక్టర్‌కు వివరిస్తూ పీవో, ఏపీవోల శిక్షణ నిమిత్తం గతంలో రెవెన్యూ డివిజన్లకు 46 ఈవీఎం యంత్రాలను ఇచ్చినట్లు వివరించారు. ఎన్నికల సెల్ అధికారులు చంద్రశేఖర్, పవన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 565 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సర మ్యాథ్స్-2బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు జనరల్‌లో 24,343 మంది, ఒకేషనల్‌లో 1,133 మంది, మొత్తం 25,476 మంది హాజరుకావాల్సి ఉండగా.. 565 మంది గైర్హాజరైనట్టు ఇంటర్ ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఆగమోక్తం నటరాజస్వామి కల్యాణం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి సభాపతి కల్యాణం ఆగమోక్తంగా జరిగింది. ఈ వేడుకలను ముక్కంటి ఆలయ ప్రాంగణంలోని 16 కాళ్ల మండపం వద్ద పురోహితులు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం శివకామసుందరి సమేత నటరాజస్వామి పురవీధుల్లో ఊరేగారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు జార్జ్‌కుమార్. గంగాధర నెల్లూరుకు చెందిన ఇతడికి సెకండ్ వేవ్‌లో కోవిడ్ సోకింది. జ్వరం, జలుబు, దగ్గుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులొచ్చాయి. దీంతో వెంటనే తిరుపతిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోవిడ్ కేంద్రంలో చేరాడు. అక్కడి వైద్యులు సకాలంలో ఆక్సిజన్ అందించి మెరుగైన చికిత్స చేసి ఊపిరి పోశారు. మొత్తం 14రోజుల పాటు వైద్యసేవలందించారు. దీంతో జార్జ్ కుమార్ త్వరగా కోలుకున్నాడు. ఈ క్రమంలో అతడి కోసం ప్రభుత్వం సుమారు రూ. 60వేలు వెచ్చించింది. కరోనా మహమ్మారి నుంచి బతికి బయట పడ్డానంటే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారణమని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని జార్జ్ తెలియజేస్తున్నాడు.



ఈమె పేరు ఆదెమ్మ, ఎస్‌ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు. ఆమె సెకండ్ వేవ్‌లో కరోనా బారిన పడింది. చిత్తూరు నగరానికి పనికెళ్లే క్రమంలో కోవిడ్ సోకింది. లక్షణాలు కనిపిస్తే..ఇంటి వద్దకే వచ్చి వైద్య సిబ్బంది పరీక్షించారు. పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో స్థానిక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కోవిడ్ సెంటర్‌కు తరలించారు. 14 రోజుల పాటు అత్యుత్తమ చికిత్స అందించారు. వైద్యుల సలహాలను క్రమం తప్పకుండా పాటించడంతో ఆదెమ్మ త్వరగానే కోవిడ్ నుంచి కోలుకుంది. అక్కడ ఉన్నన్ని రోజులూ మంచి వసతితో పాటు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించారని ఆమె సంతోషంగా తెలిపింది. డిశ్చార్జ్ సమయంలోనూ డబ్బులు కూడా ఇచ్చారని, ఆపద సమయంలో ఇంతలా చేసిన జగనన్నను ఎప్పటికీ మర్చిపోలేమని వెల్లడించింది.



కోవిడ్ బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న అధికారులు (ఫైల్)



కోవిడ్ రికవరీ పత్రం అందిస్తున్న వైద్యాధికారులు(ఫైల్)



ఆపత్కాలంలో అండగా..

- కోవిడ్ కష్టాలను జయించిన ప్రభుత్వం
- అహర్నిశలు ప్రజలకు అండగా నిలిచిన వైనం
- మహమ్మారి కట్టడికి పకడ్బందీ చర్యలు
- నిరంతరం ఫీవర్ సర్వేలు
- కట్టుదిట్టంగా లాక్‌డౌన్.. హోమ్ ఐసోలేషన్
- ఎప్పటికప్పుడు పాజిటివ్ కేసుల గుర్తింపు
- బాధితులకు బాధ్యతాయుతంగా చికిత్స
- కరోనా సమయంలో కనిపించని ప్రతిపక్షాలు

చిత్తూరు రూరల్/తిరుపతి తుడా: కోవిడ్ మహమ్మారి సుమారు రెండేళ్లపాటు జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. వైరస్ దెబ్బకు జనం భీతిల్లిపోయారు. ఇంటి గడపలు మూసుకుపోయాయి. రద్దీగా కనిపించే ప్రాంతాలు నిశ్శబ్దంగా మారాయి. కరోనా కేసులు అధికంగా నమోదు కావడంతో ప్రభుత్వం వైరస్‌పై యుద్ధం ప్రకటించింది. లాక్‌డౌన్‌ను అమలు చేసి అధికారులను సమాయత్తం చేసింది. సర్వే పేరుతో కరోనా కేసులను జల్లెడ పట్టింది. బాధితులకు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించి కోలుకునేలా చేసింది. ఆ సమయంలో కోవిడ్ కట్టడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలు, సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.

కట్టడికి చర్యలు ఇలా ..

కరోనా వైరస్ తొలుత 2020 మార్చిలో బయటపడింది. వెంటనే ప్రభుత్వం మొత్తం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. లాక్‌డౌన్ ప్రకటించి ప్రజలను ఇంటికే పరిమితం చేసింది. ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు విదేశాల నుంచి వచ్చిన వ్యక్తులకు ఎక్కడికక్కడ కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించింది. పాజిటివ్ నమోదైతే వెంటనే రెడ్‌జోన్ ప్రకటించి..వారి కుటుంబీకులకు అండగా నిలబడింది. బాధితులు హోమ్ ఐసోలేషన్ ఉండడంతోపాటు కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టింది. వైరస్ తీవ్రత అధికంగా ఉన్నవారిని ఆస్పత్రులు, క్వారంటైన్, కోవిడ్ సెంటర్లకు తరలించింది. మొదటి వేవ్‌లో కరోనా పెద్దగా ప్రభావం చూపకపోయినా, సెంకడ్ వేవ్‌లో విజృంభించింది.. దీంతో ప్రభుత్వం వైద్య సేవలను మరింత విస్తృతం చేసింది. అవసరాలకు అనుగుణంగా ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. ఆక్సిజన్ సిలిండర్ల కొరత లేకుండా కాన్సన్‌ట్రేటర్లను సమకూర్చింది. కోవిడ్ బాధితుల తరలింపు నిమిత్తం 108 వాహనాలను కేటాయించింది. విడతల వారీగా కరోనా సర్వేను విధిగా చేపట్టింది. ఫలితంగా జిల్లాలో కరోనా కట్టడి సులభతరమైంది. కోవిడ్‌లో విధులకు రోగుల సంఖ్య మేరకు అదనపు వైద్య సిబ్బందిని నియమించింది. అలాగే రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ. వెయ్యి చొప్పున్న ఆర్థికసాయం అందించింది. 15 రోజులకు ఒకసారి రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేసింది.

యుద్ధ ప్రాతిపదికన వ్యాక్సిన్

కరోనా కట్టడికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదిక వ్యాక్సినేషన్ ప్రారంభించింది. తొలుత ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు మాత్రమే వ్యాక్సిన్ ఇచ్చింది. ఈ సమయంలో వ్యాక్సిన్ వేసుకునేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ప్రజలు కోవిడ్ వ్యాక్సిన్ వేసుకునేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో కోవిషీల్డ్, కోవాగ్జిన్ వ్యాక్సిన్లకు డిమాండ్ అమాంతం పెరిగింది. అందరికీ వ్యాక్సిన్ వేయించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది. ఇంటింటికీ వెళ్లి కోవిడ్ వ్యాక్సినేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ విపత్తులో ప్రతిపక్ష పార్టీ నాయకులు తమ ఇళ్లలోనే తలదాచుకున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం
మొత్తం కోవిడ్ సెంటర్లు 36
ల్యాబ్‌లు 19
నిత్యం చేపట్టిన పరీక్షలు సుమారు 12 వేలు
మొత్తం చేసిన పరీక్షలు 35,67,999
నమోదైన పాజిటివ్ కేసులు 2,77,785
మొత్తం వేసిన వ్యాక్సిన్ డోస్‌లు 95,50,923
కోవిడ్ సెంటర్ల నిర్వహణకు వెచ్చించిన మొత్తం రూ.53.8 కోట్లు
వైద్య సిబ్బందికి ఖర్చు చేసిన మొత్తం సుమారు రూ.20 కోట్లు



కోవిడ్ సెంటర్‌లో అందించిన మెనూ

ఉదయం : రాగి జావ, కషాయం, పాలు, ఉడికించిన గుడ్లు (2 లేదా3), పండ్లు

మధ్యాహ్నం : కూరగాయలు, అన్నం, పప్పు, రసం, పెరుగు, దయాబెటిస్ రోగులకు రాగి ముద్ద

సాయంత్రం : బజ్జీలు, బోండాలు, ఉడికించిన పప్పు దినుసులు

రాత్రి : చపాతీ, అన్నం

అలాగే నిత్యం డ్రైఫ్రూట్స్

జనం రుణపడి ఉండాలి



తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గు, గొంతు పట్టేసింది. ఏదీ మింగలేకపోయా. చివరకు ఊపిరి ఆడకపోతే బిత్తర పోయా. వెంటనే చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి టెస్ట్ చేయించుకున్నా. రెండో రోజు సాయంత్రం పాజిటివ్ ఉందని ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అప్పటికే ఇంటికి దూరమై.. ప్రభుత్వం ఇచ్చిన మందులు, మాత్రలు తింటూ మామిడితోటలోని ఓ గదిలో మూడు రోజులు పాటు ఉండిపోయా. దగ్గు, జ్వరం, జలుబు తగ్గింది. కానీ ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని డాక్టర్ల సలహాలు తీసుకుని తిరుపతిలో కోవిడ్ కేంద్రానికి వెళ్లిపోయా. అక్కడ ఆక్సిజన్ అందించి...వారం రోజుల పాటు పరీక్షించారు. రికవరీ కావడంతో మరో మారు పరీక్షలు చేసి ఇంటికి పంపారు. అప్పటి వరకు ఉచితంగానే విలువైన మందులు, నాణ్యమైన ఆహారం అందించారు. అదే అప్పట్లో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లుంటే నాకు రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యి ఉండేది. అలాంటి వైద్యాన్ని ప్రభుత్వం నాకు ఉచితంగా అందించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోవిడ్ బాధితులను ఆదుకోవడంలో ముందుండి పనిచేశారు. అందుకే చాలా మంది బతికి బయటపడ్డారు. పెద్ద విపత్తు నుంచి మనల్ని రక్షించారు. మనస్సాక్షి ఉన్నవాళ్లు కరోనా సమయంలో జగనన్న చేసిన సేవను మర్చిపోరు. ఆయనకు జనం జీవితాంతం రుణపడి ఉండాలి.

– మదన్‌మోహన్‌నాయుడు, వరదరాజులపల్లె, చిత్తూరు

మరుజన్మ ఇచ్చారు



కరోనా మా జీవితంలో మరచిపోలేని చీకటి రోజులను మిగిల్చింది. ఈ మహమ్మారి నుంచి చచ్చి బతికామనే చెప్పాలి. నాతో పాటు నా కొడుకు, మనవడుకి కోవిడ్ వచ్చింది. ఇంటికి పోలీసులు, ఏఎన్‌ఎం, వలంటీర్ వచ్చి కోవిడ్ గురించి చెప్పారు. మా ముగ్గురినీ తిరుపతి శ్రీనివాసం క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. 14 రోజుల పాటు అక్కడే చూసుకున్నారు. రెండోసారి కోవిడ్ వచ్చినప్పుడు ఇంటి వద్దే క్వారంటైన్ ఏర్పాటు చేశారు. జగనన్న కరోనా కిట్‌లను అందజేశారు. ఏఎన్‌ఎం చెప్పిన ప్రకారం మందులు వేసుకున్నా. ప్రతి రోజూ మా ఇంటి చుట్టూ జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో వలంటీర్ ద్వారా సహాయం అందుకున్నా. ఆపద సమయంలో మమ్మల్ని ఆదుకున్న జగన్ బాబుకు రుణపడి ఉంటాం.

– సరసమ్మ, తిరుపతి

ప్రభుత్వ సాయంతో..



కోవిడ్‌తో ప్రపంచమే వణికిపోయింది. అగ్రదేశాలు కోవిడ్‌ను ఎదుర్కోలేక చేతులెత్తేశాయి. కళ్ల ఎదుటే కుటుంబ బంధాలు తెగిపోయాయి. ఎన్నో దేశాలు కోవిడ్ పరీక్షలు కూడా చేయలేని స్థితిలో కొట్టుమిట్టాడాయి. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల మందిని కోవిడ్ నుంచి కాపాడేందుకు రాజీలేని నిర్ణయాలు తీసుకుంది. లక్షల మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించింది. అవసరమైన మందులను ఎప్పటికప్పుడు పొరుగు దేశాల నుంచి దిగుమతి చేసుకుంది. జగనన్న తీసుకున్న చక్కటి నిర్ణయాలే ప్రజలను కాపాడాయి. వాటిని కూడా అప్పట్లో రాజకీయం చేస్తూ ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేశాయి. రాజీయం చేసి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టారు. ప్రభుత్వం సాయంతో ప్రాణాలు కాపాడుకున్న వారిలో నేనూ ఒకడిని.

– చింతల వివేక్, తిరుపతి

ప్రభుత్వమే ప్రాణం పోసింది



జ్వరం, దగ్గు ఉండటంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డా. మిత్రుడి సహాయంతో కోవిడ్ టెస్ట్ చేసుకున్నా. పాజిటివ్‌గా తేలింది. గంటల వ్యవధిలోనే ఈ సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది మా ఇంటి వద్ద ప్రత్యక్షమయ్యారు. ఇంట్లోనే ఉంటామని చెప్పడంతో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మెడికల్ కిట్ తోపాటు ఇంట్లోని అందరికీ పరీక్షలు చేయించారు. హోమ్ ఐసోలేషన్‌లో ఉన్న నా పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం తీసుకుంది. ఇంట్లోనే వైద్యం అందుకున్నా. వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణతో కోవిడ్‌ను జయించా. విపత్కర పరిస్థితుల్లో జగనన్న తీసుకున్న రాజీలేని నిర్ణయాలే ప్రజలకు ప్రాణవాయువుగా నిలిచాయి.

– గిరికుమార్, తిరుపతి

ఆయుష్షు పోశారు



కరోనా సమయంలో ఊరంతా అల్లాడిపోయింది. పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా గడగడలాడిపోయారు. దేవుడుపై భారం వేసి ఇంట్లోనే ఉండిపోయాం. అధికారులు, డాక్టర్లు, ఏఎన్‌ఎంలు మా ఊర్లో ఉన్నవాళ్లందరికీ పరీక్షలు చేశారు. పాజిటివ్ వచ్చిన వాళ్లను ఇంట్లోనే ఉంచి మందులు, మాత్రలు ఇచ్చారు. 14 రోజులు బయటకు రాకుండా చూశారు. మా ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. మమల్ని కాపాడారు. మాకు తమిళనాడు 7 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ కరోనా ఎలా సేవలు ఎలా అందాయో..కళ్లారా చూశాం. వైద్యం అందక అక్కడి జనం కరోనాతో పిట్టల్లా రాలిపోయారు. తినే తిండికి కూడా అల్లాడిపోయారు. మన రాష్ట్రంలో అలాంటి కష్టం రాకుండా..జగనన్న వైద్యులను ఇంటి వద్దకే పంపించారు. సిబ్బందిని కాపలా పెట్టారు. మాకు ఆయుష్షు పోశారు.

– సుధాకర్, జంభుగోళంపల్లె, చిత్తూరు మండలం


జీవితాంతం మర్చిపోను



కరోనా పెద్ద విపత్తు. ఆ వేళ ఆదుకోవడంలో ప్రభుత్వం విజయం సాధించింది. దేశంలో ఎక్కడా చేయనంతగా మనరాష్ట్రంలో కరోనా కట్టడికి చర్యలు చేపట్టింది. సేవలు అందించింది. మాలాంటి వాళ్లకు మరో ప్రాణం పోసింది. నా పరిస్థితి ఆందోళన కరంగా మారితే వెంటనే ఆస్పత్రికి వెళ్లా. బతుకుతానో..లేదో తెలియదు. భయం గుప్పెట్లో ఆస్పత్రి మెట్లు ఎక్కినా, అక్కడ కోవిడ్ జాగ్రత్తలు తెలిజేస్తూ అంటించి పోస్టర్లు, ముఖ్యమంత్రి ఫొటో ముద్రించిన వైద్య సేవలకు సంబంధించిన పోస్టర్‌ను చూసి భరోసా కలిగింది. అక్కడి డాక్టర్లు నా బాగోగులను చూసుకున్నారు. బతికించారు. ఆరోజు ఆస్పత్రి నుంచి నేను ప్రాణంతో బయటకు వచ్చానంటే అందుకు ప్రధాన కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నిర్భయంగా చెబుతా. ప్రభుత్వ సేవను జీవితంలో మర్చిపోను. ఆయనకు ఏం ఇచ్చి రుణం తీర్చుకోవాలి. కచ్చితంగా ఎప్పటికి జగనన్న వెంటే ఉంటా.

– సత్తార్ సాహెబ్, చిగరపల్లి, ఐరాల మండలం


జగనన్న పెట్టిన ప్రాణభిక్ష



కరోనా వచ్చిందని ఊర్లను శుభ్రం చేశారు. బ్లీచింగ్ స్ప్రే చేయించారు. ఇంటింటికి రూ. వెయ్యి ఇచ్చారు. నెలకు రెండు సార్లు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. పాజిటివ్ వస్తే అధికాలంతా మా ఊరి ముందు నిలబడ్డారు. వచ్చిన వ్యక్తికి పరీక్ష చేయడం నుంచి బాగోగులను చూసుకున్నారు. ఇంటికి సరుకులు కావాల, వారు బయట రాకుండా ప్రభుత్వ అధికారులే కొనిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కూరగాయలను ఇంటింటికీ పంచిపెట్టారు. ఇలా ప్రతివిషయంలో జగనన్న మాకు అండగా నిలబడ్డారు. ఈ విధంగా ఎక్కడా లేదు. మా పక్కనే ఉన్న తమిళనాడులో కోవిడ్ బాధితులను ఎవరూ పట్టించుకోలేదు. వైద్యం సంగతి దేవుడెరుగు, తినే తిండికి కూడా వాళ్లు చాలా కష్టపడ్డారు. మన రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఢోకా లేకుండా చూసుకున్నారంటే..అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ. ఈరోజు ఇలా రోడ్డు మీద తిరుగుతున్నామంటే ..ఆయన పెట్టిన ప్రాణ భిక్ష.

– జానకి, చిత్తూరు


భయానక రోజులవి



కరోనా.. ఈ పేరు వింటేనే ఇప్పటికీ భయం వేస్తుంది. కుటుంబాలను విచ్ఛిన్నం చేసిన మహమ్మారితో. కళ్ల ఎదుటే ఎంతో మంది మృత్యువాత పడ్డారు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చూపిన మానవత్వాన్ని, పనితీరును ఈ సమాజం ఎప్పటికీ మరచిపోదు. కోవిడ్ సోకి విపత్కర పరిస్థితుల్లో ఉన్న నాకు జగనన్న ప్రభుత్వం భరోసా నిచ్చింది. కోవిడ్ టెస్ట్ చేయడంతో పాజిటివ్ వచ్చింది. ఇక అక్కడి నుంచి 108లో తిరుపతిలోని శ్రీనివాసం క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. 14 రోజుల పాటు మూడు పూటలా పౌష్టికాహారం, సకాలంలో మందులు ఇచ్చి అతిథిలా చూసుకున్నారు. రోజుకు రెండు సార్లు వైద్యులు పరీక్షించేవారు. కోవిడ్ జయించానంటే అందుకు కారణం క్వారంటైన్ సెంటర్‌లో తీసుకున్న జాగ్రత్తలు, ఏర్పాట్లే.

– కల్యాణ్ కుమార్, పాకాల మండలం

రుణం తీర్చుకోలేం



కోవిడ్ తాండవించే రోజుల్లో మా ఇంట్లో అందరికి జ్వరం వచ్చింది. కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసుకోగా అందరికీ పాజిటివ్ వచ్చింది. సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది మమ్మల్ని తిరుచానూరులోని శ్రీపద్మావతి నిలయం కోవిడ్ సెంటర్‌కు తరలించారు. వారం రోజుల పాటు అక్కడ వైద్యం అందించారు. మూడు పూటలా అల్పాహారం, స్నాక్స్, ఇతర పౌష్టికాహారం అందించారు. జగనన్న ఆరోగ్య కిట్‌లను ఇచ్చారు. అక్కడ ఏర్పాట్లు, వైద్యుల సేవలే మమ్మల్ని రక్షించాయి. ఆపై ఇంటికి వచ్చాక ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. భయానక పరిస్థితుల్లో ఉన్న మమ్మల్ని జగనన్న ప్రభుత్వం కాపాడింది. కష్టకాలంలో మాకు అండగా నిలిచింది. జగనన్న రుణం తీర్చుకోలేం.

– కదిరి గంగాదేవి, తిరుపతి

స్విమ్స్‌లో 479 నర్సింగ్ పోస్టులు

- తిరుమల, తిరుపతిలో పలు అభివృద్ధి పనులకు నగదు మంజూరు
- పాలకమండలి సమావేశంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: స్విమ్స్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు 479 నర్సు పోస్టులు భర్తీ చేసేందుకు టీటీడీ పాలకమండలి ఆమోదించినట్లు చైర్మన్ భూమనకరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇలా ఉన్నాయి..

- టీటీడీలో కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని నిర్ణయం.
- టీటీడీ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థినీవిద్యార్థులందరికీ ఎలాంటి సిఫారసు లేకుండా హాస్టల్ వసతి కల్పించడానికి అవసరమైన హాస్టళ్ల నిర్మాణానికి ఆమోదం.
- రూ.1.88 కోట్లతో తిరుమలలో భక్తుల సౌకర్యార్థం పీఏసీ-1లో 10 లిఫ్టుల ఏర్పాటు
- రూ.1.50 కోట్లతో బాలాజీ నగర్ తూర్పు వైపున, అదేవిధంగా శ్రీపద్మావతి విశ్రాంతి భవనం ఔటర్ కార్డన్ ప్రాంతంలో మిగిలిపోయిన ఫెన్సింగ్ ఏర్పాటు
- రూ.14 కోట్లతో తిరుమలలో టీటీడీ ఉద్యోగుల పాత సీ టైప్, డీ టైప్, కొత్త సీ టైప్, డీ టైప్ క్వార్టర్లలో మిగిలి ఉన్న 184 క్వార్టర్ల అభివృద్ధి పనులు
- తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలోని భాష్యకార్ల సన్నిధిలోని మకర తోరణానికి, శ్రీ పార్థసారథిస్వామి, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి తిరుఆభరణాలకు బంగారు తాపడం
- ఐదేళ్ల పాటు డేటా సెంటర్ల మెయింటెనెన్స్ కోసం రూ.12 కోట్లు మంజూరు
- టీటీడీ ఆధ్వర్యంలో 15 చారిత్రాత్మక, పురాతన ఆలయాలు, 13 టీటీడీ నిర్మించిన ఆలయాలు, 22 ఆధీనంలోకి తీసుకున్న ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో అవసరమైన అభివృద్ధి పనులను శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా చేపట్టేందుకు పాలనా పరమైన అనుమతికి ఆమోదం.
- ఇటీవల ఘాట్ రోడ్డులో మృతిచెందిన తిరుమల శ్రీవారి ఆలయ పరిచారిక శ్రీయతిరాజన్‌నరసింహన్ కుటుంబానికి రూ.5 లక్షలు.

సమావేశంలో దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, పలువురు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై భూమన 'కరుణ'

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.114ను టీటీడీలో అమలు చేయడానికి ఎదురైన అడ్డంకులను తొలగిస్తూ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. జీవో అమలులో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ 2014 జూన్ 2వ తేదీకి ముందు టీటీడీ బోర్డు తీర్మానాల ద్వారా (నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా) చేరిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడానికి అనుమతించాలని కోరుతూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం వల్ల వందలాది కుటుంబాలకు మేలు జరగనుంది. గత 15 నుంచి 18 సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగుల కల నెరవేరనుంది. చైర్మన్ నిర్ణయంపై కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలిబూడిదైన మామిడి, కొబ్బరి మొక్కలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాకాల : అగ్ని ప్రమాదంలో మామిడి, కొబ్బరి మొక్కలు కాలిపోయిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీలో సోమవారం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు మంటలంటుకుని గ్రామానికి చెందిన మహిళా రైతు ఎం.శిరీషకు చెందిన 35 మామిడి చెట్లు, శ్రీనివాసుల నాయుడుకు 10 మామిడి చెట్లు, 10 కొబ్బరి మొక్కలు, ప్రసాదరావుకి 5 మామిడి చెట్లు కాలిబూడిదైనట్లు బాధితులు వాపోయారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు



తాళిబొట్టు చూపుతున్న వేదపండితులు



పూజలు చేస్తున్న వేదపండితులు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

- శ్రీకాళహస్తిలో పెళ్లి కళ
- అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం
- ఒక్కటైన కొత్తజంటలు

శ్రీకాళహస్తి: ఆదిదంపతుల కల్యాణం భక్తుల కోలాహలం మధ్య కమనీయంగా సాగింది. భక్తులను అనుగ్రహించడానికి బహిరంగంగా పార్వతీపరమేశ్వరులు జరుపుకున్న వివాహ మహోత్సవం భక్తజన కోటిని పరవశింపజేసింది. అశేష భక్తజన వాహిని మధ్య ఆదిదంపతుల కల్యాణం అంగరంగ వైభంగా జరిగింది. సోమవారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరునిచే మాంగళ్యధారణ జరగగా.. అదే శుభ ఘడియల్లో ఆదిదంపతుల సమక్షంలో నూతన జంటలు వివాహం చేసుకుని ఒకటయ్యారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం వేకువజామున ఆదిదంపతుల కల్యాణం కమనీయంగా సాగింది. అంతకుముందు ఆదివారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి వేదోక్తంగా పూజలు చేశారు. అనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అధిష్టింపజేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలు మధ్య పెండ్లిమండపం వద్దకు చేర్చారు. పెండ్లి మండపం వద్దకు మొదట పరమేశ్వరుడు చేరుకోగా.. మధ్యలో పార్వతీదేవి అలకబూనడంతో చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం చేసి అమ్మవారి అలక తీర్చారు. అందుకు సంతృప్తి చెందిన జ్ఞానప్రసూనాంబ పెండ్లి మండపం వద్దకు చేరుకున్నారు. పరమేశ్వరుడు, పార్వతీదేవి పెళ్లిపీటలపై ఆశీనులయ్యారు. వేదపండితుల కలశ స్థాపన చేశారు. సంకల్పం, యజ్ఞాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆదిదంపతుల కల్యాణ ఘటన్ని పూర్తిచేశారు. శివపార్వతుల పెళ్లిని వీక్షించడానికి పట్టణ వాసులతో పాటు పరిసర ప్రాంతలకు చెందిన భక్తజనం తరలివచ్చారు. నగరివీధి, నెహ్రూ వీధి భక్తులతో నిండిపోయాయి. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, విజయవాడ ఈవో రామారావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రుద్రాక్ష చప్పరాలపై శివయ్య వైభవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి రుద్రాక్ష చప్పరాపై పురవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు.ఆదిదంపతుల కల్యాణం ముగిసిన తరువాత ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేదోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రుద్రాక్ష చప్పరాలపై అధిషించి పురవీధుల్లో ఊరేగించారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ఒక్కటైన నూతన జంటలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా కొన్ని నూతన జంటలు ఒక్కటయ్యాయి. నూతన వధూవరులకు ముక్కంటి ఆలయం తరఫున మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. జ్ఞానప్రసూనాంబ దేవికి మాంగళ్యధారణ చేసిన సమయంలోనే ఈ జంటలు కూడా మాంగళ్యధారణ కార్యక్రమం పూర్తిచేసి ఒక్కటయ్యారు.

నేడు గిరిప్రదక్షిణ

అతిధులకు స్వాగతం పలకడం, వీడ్కోలు పలకడం భారతీయ సనాతన ధర్మాల్లో ఒకటి. అందులో భాగంగా ఇది దేవతల నుంచి మనకు వచ్చినట్లుగా పురాణ కథల ద్వారా తెలుస్తోంది. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో గిరిప్రదక్షిణ అనేది కల్యాణానికి వచ్చిన దేవతలు, రుషులకు వీడ్కోలు పలికే యాత్రగా పురాణాల్లో అభివర్ణించబడి ఉంది. శ్రీకాళహస్తిలో సంక్రాంతి పండుగ తరువాత రోజు కనుమపండుగ నాడు గిరిప్రదక్షిణగా వెళ్లి దేవతలు, రుషులను తమ కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం ముగిసిన తర్వాత కల్యాణానికి వచ్చిన రుషులు, దేవతలను శివపార్వతులు గిరిప్రదక్షిణగా వెళ్లి సాగనంపుతారు. ఈ మేరకు మంగళవారం జరగనున్న గిరిప్రదక్షిణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఎన్నికల ఏర్పాట్లు పటిష్టం



ఆర్డీఓకు సూచనలు చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఎస్పీ కృష్ణకాంత్‌పాటిల్‌తో కలిసి తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలతోపాటు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను ఆ రెండు కళాశాలల్లో భద్రపరచడానికి అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్వీయూ జూనియర్ కళాశాలలో మూడు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడ సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. అలాగే తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో కౌంటింగ్ ఉంటుందని వెల్లడించారు. వారితోపాటు ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, ఆర్‌ఎస్ డీటీ రామచంద్ర ఉన్నారు.

రిజిస్ట్రార్ పదవీ కాలం పొడిగింపు



రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్ రజినీ పదవీకాలం మరో రెండు సంవత్సరాల పాటు పొడిగిస్తూ వీసీ డీ.భారతి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో ఏడాది కాలంగా ఆమె చేసిన కృషి అభినందనీయమన్నారు. వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఆమెను అభినందించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల అబ్జర్వర్‌గా మస్తానయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించే పది, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షల అబ్జర్వర్‌గా మస్తానయ్యను నియమించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్ ఉత్తర్వులు జారీచేశారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఎస్ఐఈఎంఏటీ) రాష్ట్ర డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మస్తానయ్యను జిల్లా పరీక్షల పరిశీలకులుగా నియమించారు. ఆయన ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించే ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలను పర్యవేక్షిస్తారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అబ్జర్వర్‌గా ఆయన వ్యవహరించనున్నారు. తిరుపతి జిల్లా అబ్జర్వర్‌గా నెల్లూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ డా.పి.రమేష్‌ను నియమించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

రూ.10 లక్షల విలువ చేసే బంగారు స్వాధీనం



పట్టుబడిన బంగారు, దొంగను చూపిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: రాత్రి సమయంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆయన కథనం.. కర్ణాటక రాష్ట్రం, యవనహళ్లికి చెందిన వినోద్ అలియాస్ మీర్ మజ్జిగ (38) మరికొందరు దొంగలతో కలిసి కర్ణాటక రాష్ట్రంలో దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చాడు. ఇతనిపై ధర్మపురి పోలీసులు గూండా యాక్టు కింద కేసు కూడా నమోదు చేశారు. జైల్లో పరిచయమైన ముంబైకి చెందిన సలీంతో ఆంధ్రప్రదేశ్ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడేవాడు. పక్కా సమాచారంతో మంగళం–కరకంబాడి రోడ్‌లో సోమవారం మీర్‌మజ్జిగను అరెస్ట్‌చేసి అతని వద్ద 10 లక్షల విలువగల 178 గ్రాముల బంగారు, రూ.75 వేల విలువచేసే 1,250 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది

మద్యం దుకాణంలో రూ.6 లక్షలు చోరీ



రేకును తొలగించిన దృశ్యం

గూడూరు రూరల్: మద్యం దుకాణంలో రూ.6 లక్షలు చోరీ జరిగిన సంఘటన సోమవారం గూడూరు రూరల్ పరిధిలోని కొండాగుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం.. కొండాగుంట గ్రా మ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో ఆదివారం రూ.6 లక్షల వరకు మద్యం విక్రయించారు. రాత్రి కావడంతో నగదు దుకాణంలోనే భద్రం చేసి సేల్స్‌మన్ ఇంటికి వెళ్లాడు. దీన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణం పైన ఉన్న రేకును తొలగించి దుకాణంలోకి చొరబడి రూ.6 లక్షల నగదును చోరీ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

జగనన్న పాలనలో ఇళ్లు కాదు ఊర్లే నిర్మాణం

- ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం
- సంక్షేమ పథకాల ద్వారా రూ.3.45లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమ
- ఎన్నికల సమయంలో బాబు మాయ మాటలను నమ్మకండి
- తిరుపతిలో జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమన, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష



జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

తిరుపతి మంగళం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్రంలో ఊర్లుకు ఊర్లే నిర్మించారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి ఇందిరా మైదానంలో సోమవారం జగనన్న ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులకు భూమనతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే. బాబు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా పేదలకు జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఆ మాటకొస్తే రాష్ట్రంలో కొత్తగా ఊర్లకు ఊర్లనే నిర్మిస్తున్నారని, ఇందు కోసం జగనన్న రూ.56 వేల కోట్లను ఖర్చు చేశారని తెలిపారు. ఇప్పటివరకు జగనన్న రూ.2.75లక్షల కోట్లను నేరుగా మహిళల ఖాతాల్లోనే జమ చేశారని, సంక్షేమ పథకాల కింద మరో రూ.లక్ష కోట్లతో కలిపి రూ.3.45కోట్లను పేదలకు ఇచ్చారని తెలిపారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం విద్యాభివృద్ధికి జగనన్న రూ.52 వేల కోట్లను ఖర్చు చేశారని పేర్కొన్నారు. తిరుపతిలో జగనన్న ఇప్పటికే 26 వేల ఇళ్ల స్థలాలు ఇచ్చారని, మరో రెండు వేల ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు అందరికీ ఇళ్లను నిర్మించి, తాళాలు కూడా అందజేస్తామన్నారు. జగనన్న చలువతోనే తిరుపతిలో కొత్తగా 22 మాస్టర్ ప్లాన్ రోడ్లను వేసినట్టు వెల్లడించారు. టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని, అలాగే విశ్రాంత ఉద్యోగులకు మంగళవారం ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. టీటీడీలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10వేల నుంచి రూ. 20వేల వరకు జీతాలు పెంచినట్టు గుర్తుచేశారు. చంద్రబాబు లాగా ఎన్నికల సమయంలో నోటికి వచ్చిన అబద్ధపు హామీలు ఇచ్చి వదిలేసే నాయకుడు జగనన్న కాదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ రెడ్డి, హౌసింగ్ కాటంరాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, జగనన్న ఇంటి స్థల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

200 మంది ముస్లిం, మైనారిటీలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ముస్లింలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనారిటీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సోమవారం జరిగిన ముస్లిం, మైనారిటీల ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యేతోపాటు ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి , సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన 200 మందికి పైగా ముస్లిం, మైనారిటీలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యేతో పాటు నాయకులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయుడుపేటలో ఈద్గా కోసం రెండు ఎకరాల స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈద్గా మైదానం స్థలంలో తన సొంత నిధులతో బోర్‌వెల్ వేయిస్తానని, గ్రావెల్ కూడా తోలుతానని హామీ ఇచ్చారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం, మైనారిటీ నాయకులు రఫీ ఎమ్మెల్యే సంజీవయ్యకు అజ్మీర్ నుంచి తీసుకొచ్చిన చేతి పట్టీని కట్టారు. నాయకులు రఫీ, షఫీ తదితరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేందుకు తామంతా సిద్ధమని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, చదలవాడ కుమార్, కే.చెంచయ్య, జీ.సిద్ధయ్య, ధారరవి, పాపాడి చంద్రారెడ్డి, పీ.నాగార్జున పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఎన్నికలు



పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పాటిల్

తిరుపతి క్రైమ్: సమష్టి కృషితో రానున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో ఆయన కేంద్ర సాయుధ బలగాలతో సమన్వయ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి భక్తుల భద్రతతో పాటు రానున్న ఎన్నికలు కూడా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే కేంద్రం నుంచి జిల్లాకు నాలుగు బీఎస్ఎఫ్ దళాలు వచ్చాయన్నారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, బీఎస్ఎఫ్ డిప్యూటీ కమాండర్ సమీర్ వర్మ పాల్గొన్నారు.